www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 10 మే 2023



'జగనన్నకు చెబుదాం' టోల్‌ఫ్రీ నంబర్ 1902

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: 'జగనన్నకు చెబుదాం' అనే కార్యక్రమం ఒక వినూత్నమైన ప్రతిష్టాత్మకమైన కార్యక్రమమని, టోల్ ఫ్రీ నంబర్ 1902 నంబర్ పై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని, స్పందన గ్రీవెన్స్ కు మెరుగులు దిద్ది ప్రజల సమస్యలకు నాణ్యమైన, సత్వర పరిష్కారం కొరకే ఈ జగనన్నకు చెబుదాం అని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం ప్రారంభించారు. అన్ని జిల్లాల నుంచి కలెక్టర్లు, జేసీలు, ఎస్‌పిలు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వివక్షలేని, అవినీతి లేని పారదర్శక పాలన, అర్హులైన లబ్ధిదారులకు నిజాయితీగా సంక్షేమ ఫలాలు అందించే దిశలో ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్, ఎంపి రెడ్డప్ప, జెడ్‌పి ఛైర్మన్ జి.శ్రీనివాసులు, ట్రైనీ కలెక్టర్ వై.మేఘ స్వరూప్, ఎస్పీ రిషాంత్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, మేయర్ అముద, డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్, డిసిసిబి ఛైర్‌పర్సన్ రెడ్డమ్మతో పాటు జిల్లా అధికారులతో కలిసి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి హాజరయ్యారు. అలాగే జిల్లా స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు ముఖ్య మంత్రి సందేశాన్ని వీక్షించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులు

జగనన్నకు చెబుదాం...!

'మీకు అర్హత ఉండి కూడా ఏ కారణం చేతైనా మీకు సంక్షేమ పథకాలు అందకపోయినా, ప్రభుత్వ సేవలు అందకపోయినా, న్యాయం మీ వైపున ఉన్నా, న్యాయం జరగని పక్షాన ఇంతకుముందు ప్రయత్నం చేసినా ఆ ప్రయత్నం సత్ఫలితం ఇవ్వని పరిస్థితుల్లో ఇక నేరుగా మీ జగనన్నకు చెబుదాం. జగనన్నకు చెబుదాం కార్యక్రమం మిగతా కార్యక్రమాలకంటే భిన్నమైనది.

ప్రతి సమస్యకూ పరిష్కారం చూపాలన్న తపనతో నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం సాగించిన పరిపాలన తీరే దీనికి నిదర్శనం. 3648 కి.మీ సాగిన సుదీర్ఘ పాదయాత్రలో ప్రతి గ్రామంలో, ప్రతి జిల్లాలో తనకు కనిపించిన సమస్యలకు పరిష్కారం వెతికే దిశగా అడుగులు వేస్తూ ఈ నాలుగేళ్లుగా పరిపాలన ముందుకు సాగింది. చాలావరకు ఉత్పన్నమయ్యే సమస్యలు అన్నీ కూడా మానవ తప్పిదాలే అని పాదయాత్రలో అర్థమయ్యింది. ప్రభుత్వ సేవలకు సంబంధించి ఇలాంటి వ్యక్తిగత సమస్యలకు మరింత మెరుగైన పరిష్కారం చూపేలా తపన, తాపత్రయంతో పుట్టకొచ్చిన మరొక మెరుగైన ఆలోచన... నేరుగా మీ జగనన్నకు చెబుదాం. నేరుగా మీ ముఖ్యమంత్రికే చెబుదాం.. అనే గొప్ప ఆలోచన ద్వారా మంచి కార్యక్రమాన్ని తీసుకువచ్చామన్ని తెలిపారు.మారుమూల గ్రామాల నుంచి జిల్లా స్థాయి వరకూ, కలెక్టర్లు దగ్గర నుంచి మున్సిపల్ కమిషనర్లు వరకూ.. అక్కడ నుంచి గ్రామ సచివాలయాల వరకు అన్ని స్థాయిల్లో అందర్నీ ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేస్తున్నాం. ఫోన్ చేశాక మీకు యునిక్ ఐడీ నంబరు వస్తుంది. యువర్ సర్వీస్ రిఫరెన్స్ ఐడీ నంబర్ వస్తుంది. వైఎస్సార్ ఐడీ నెంబరు అని పేరుపెట్టాం. మీ ఫిర్యాదుకు అంత గౌరవం ఇస్తూ వైయస్సార్ పేరు పెట్టాం. మీ సమస్యను నా సమస్యగా భావించి.. దాన్ని ట్రాక్ చేస్తాం. నేరుగా సీఎంఓనే దీన్ని ట్రాక్ చేస్తుంది. ప్రతి అడుగులోనూ మీకు కూడా ఎస్ఎంఎస్ ద్వారా, ఐవిఆర్ఎస్ ద్వారా మీ ఫిర్యాదు పరిష్కారంపై ఎప్పటికప్పుడు మెసేజ్‌లు, సందేశాలు వస్తాయి. లేదా నేరుగా మీ సమస్య పరిష్కారం ఏ స్థాయిలో ఉందో నేరుగా మీరు కూడా వెబ్‌సైట్లో చూడవచ్చు. జగనన్నకు చెబుదాం వెబ్‌సైట్‌ను లాంఛనంగా ప్రారంభించారు.

టిడ్కో గృహాలకు

మౌలిక వసతులపై నివేదిక ఇవ్వాలి



టిడ్కో ఇళ్లు, పారిశుధ్యంపై సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో ఇంకా అంచనా వేయని ఆస్తులు ఉన్నాయని వాటిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని శానిటేషన్ టిడ్కో గహాలకు సంబంధించి మౌలిక వసతుల మీద నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో మెప్మా, మున్సిపల్, టిడ్కో గహాలకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంకా మూడువేల స్థలాలకు సంబంధించి అసెస్మెంట్ చేయడం జరగలేదని వెంటనే పూర్తి చేయాలన్నారు. శానిటేషన్ ప్రక్రియ అత్యంత పకడ్బందీగా చేయాలని ఆదాయం వచ్చేవిధంగా శానిటేషన్ ప్రక్రియ నిర్వహిస్తే రానున్న రోజుల్లో ఎటువంటి ఇబ్బందులు ఉండవని ఆవిధంగా సరైన ప్రణాళిక రూపొందించుకోవాలని అన్నారు. ఒక ప్రణాళిక ద్వారా మున్సిపాలిటీలలో ఆదాయం పెంచుకోవడంతో పాటు ఎరువుల తయారీపై దష్టిపెట్టాలని అన్నారు. టిడ్కో సంబంధించి ప్రస్తుతం ఉన్న పరిస్థితుల మీద వాస్తవనివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో అన్ని నగరపాలిక, మున్సిపల్ ప్రాంతాల్లో జరుగుతున్న తీరు గురించి జిల్లా కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్‌తో పాటు ట్రైనీ కలెక్టర్ వై.మేఘ స్వరూప్, మెప్మా పీడీ రాధమ్మ, చిత్తూర్ నగరపాలిక కమిషనర్ అరుణ పాల్గొనగా ఇతర కమిషనర్లు అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

లీకేజీలు లేకుండా చూడండి

మున్సిపల్ కమిషనర్ అరుణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరంలో నీటిసరఫరా చేస్తున్న పైపుల్లో లీకేజీలు లేకుండా సత్వర చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ మిట్టూరు ప్రాంతంలో పలు వీధుల్లో నీటిసరఫరా పైప్‌లైన్లను తనిఖీ చేశారు. పలు ప్రాంతాల్లో నీటి లీకేజీలను గుర్తించి ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించారు. ఎక్కడా పైప్‌లైన్లలో లీకేజీ లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నీటి వధా అరికట్టడం, నీరు కలుషితం కాకుండా చూడడంలో భాగంగా లీకేజీలకు వేగంగా మరమ్మతులు చేపట్టాలని, ఈ మేరకు క్షేత్రస్థాయిలో ఫిట్టర్లకు అవగాహన కల్పించాలని అన్నారు. నగరంలో 50వ వార్డుల పరిధిలోనూ నీటి సరఫరా పైపుల పరిస్థితి, లీకేజీలు, నివారణకు తీసుకుంటున్న చర్యలపై సత్వరం నివేదిక ఇవ్వాలని డీఈలు, ఏఈలను ఆదేశించారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశుద్ధ్య పనులను మరింత మెరుగుపరచాలని పారిశుద్ధ్య విభాగం అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో డీఈలు రమణ, వెంకటప్రసాద్, శానిటరీ ఇన్స్పెక్టర్ చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



నీటి సరఫరా పైపుల లీకేజీలను పరిశీలిస్తున్న నగర కమిషనర్

డెయిరీ ఆవరణలో శుభ్రత పనులు వేగవంతం

నగరంలోని విజయ డెయిరీ ఆవరణలో జరుగుతున్న శుభ్రత పనులు వేగంగా పూర్తి చేయాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. విజయ డెయిరీ ఆవరణలో జరుగుతున్న పనులను కమిషనర్ మంగళవారం పరిశీలించారు. డెయిరీ ఆవరణం, లోపలి రహదారుల్లో పిచ్చిమొక్కలు, ముళ్ళ కంపలు విపరీతంగా పెరిగిపోయింది. వీటిని తొలగించే పనులు గతవారం రోజులుగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. జేసీబీలతో మొక్కలు, పొదలను తొలగిస్తున్నారు. ప్రధాన భవనాలు, దారులను శుభ్రం చేసే పనులను కమిషనర్ పరిశీలించి అధికారులకు మార్గనిర్దేశం చేశారు. పనులను సత్వరం పూర్తిచేయాలని నగరపాలక ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. అనంతరం కమిషనర్ డెయిరీ ఎదురుగా మురుగునీటి కాలువను పరిశీలించారు. కమిషనర్ వెంట ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్స్పెక్టర్ లోకానాథం, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.



సహకార విజయ డెయిరీ ఆవరణలో శుభ్రత పనులు పరిశీలిస్తున్న నగర కమిషనర్

జగనన్న ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రజల సంక్షేమం నిమిత్తం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు పారదర్శకంగా చేర వేసేందుకు అధికారులు కషి చేయాలని చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డప్ప జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రాష్ట్ర సమాచార పౌర సంబంధాలశాఖ రూపొందించిన 'జగనన్న ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్ 2023-24' ను చిత్తూరు పార్లమెంటు సభ్యులు, జెడ్‌పి ఛైర్మన్, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ రిశాంత్‌రెడ్డి, చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్, డిసిసిబి ఛైర్మన్ రెడ్డమ్మ, నగర మేయర్ అముద, ఎఎస్‌పి శ్రీలక్ష్మి, స్త్రీ శిశు సంక్షేమశాఖ రీజనల్ ఆర్గనైజర్ శైలజారెడ్డిలతో కలసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ క్యాలెండర్ ప్రకారం పథకాలను అమలు చేయడం జరుగుతున్నదని, ఈ సంక్షేమ క్యాలెండర్లను మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు ఇతర ప్రజాప్రతినిధులకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ మహిళా సంక్షేమ స్థాయి సంఘ ఛైర్మన్ భారతి, జెడ్పిసిఈఓ ప్రభాకర్ రెడ్డి, జిల్లా అది కారులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై కమిషనర్‌కు వినతి



ప్రజాసమస్యలపై కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: 112 సంవత్సరాల చరిత్ర కలిగిన జిల్లా కేంద్రం చిత్తూరు నగరంలో ప్రధాన సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ మంగళవారం మన చిత్తూరు అభివద్ధి వేదిక కన్వీనర్ చైతన్య, కో-కన్వీనర్‌లు మురళి, అజంతుల్లా కేశవరెడ్డి, రమణరావు, కష్ణ సింగ్, దుడ్డి రమణ, బుజ్జి, సురేంద్రనాథ్, దాడి మున్నా, సతీష్,సాధిక్ ఖాన్, కుమరేశ్, కుమార్ వర్మ కమిషనర్ డాక్టర్ అరుణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సుమారు గంట సేపు నాయకులతో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. నాయకులు మాట్లాడుతూ చిత్తూరు నగరంలో వీధికుక్కల దాడులు నుండి కాపాడాలి, 50 డివిజన్లలో దోమల నివారణకు మురికి కాలువలను శుభ్రం, ఫాగింగ్ చేపట్టాలని కోరారు. ప్రతి వీధిలో దీపాలు వెలిగేటట్టు చూడాలని, విద్యుత్ స్తంభాలు లేనిచోట్ల కొత్తగా వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, నగరంలో నీటిపైపుల లీకేజిని అరికట్టేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఎన్టీఆర్ జలాశయం కలుషితం కాకుండా చూడాలి బొట్‌క్లబ్ ఏర్పాటు చేయడంతోపాటు లెనిన్‌నగర్ లోని డంపింగ్ యార్డును దూర ప్రాంతానికి వెంటనే తరలించాలని నీవానదిలో వ్యర్థాలు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. నేతలు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై నగర కమిషనర్ సానుకూలంగా స్పందించారు.

కళాకారుల విడిది కేంద్రం 'అందరి ఇల్లు'

వేడుకగా అన్నమయ్య జయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి- తిరుపతి

తిరుమల కొండపై శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల ఇంటిని పునర్నిర్మించాలని, కళాకారుల విడిది కేంద్రమైన మంగళంలోని బిటిఆర్ కాలనీలోని 'అందరి ఇల్లు'ను ఉపయోగించుకోవాలని, జానపద కళలను కాపాడుకోవాలని వక్తలు ఉద్ఘాటించారు. తిరుపతి మంగళంలోని బిటిఆర్ కాలనీలోని అన్నమయ్య కళాక్షేత్రంలో అన్నమయ్య 615 వ జయంతి ఉత్సవాలను మంగళవారం ఉదయం వేడుకగా ప్రారంభించారు. తొలుతగా అన్నమాచార్యుల చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. చిత్తూరు, తిరుపతి, సత్యసాయి జిల్లాల వ్యాప్తంగా వచ్చిన కళాకారులు తమ కళారూపాలతో కన్నుల పండుగగా ప్రదర్శనలు ఇచ్చారు. జానపద వత్తి కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జగన్మోహన్రావు, బంగారు మురళి మాట్లాడుతూ... భజన సంప్రదాయానికి ఆద్యుడు అన్నమయ్య అని ఆయన జ్ఞాపకంగా మంగళంలో ఏర్పాటు చేసిన అన్నమయ్య కళాక్షేత్రాన్ని సందర్శించి అక్కడున్న 'అందరి ఇల్లులో' విడిది చేయాలని కోరారు. ఇక్కడ కళాకారులకు అవసరమైన వంట సామాగ్రి ఇతర సౌకర్యాలను ఉచితంగానే తాము ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కళాకారులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జానపద కళాకారుల సంఘము నేతలు దేవానంద్, నాగరాజు, శంకరయ్య స్వామి, మునిరత్నం, రామారావు , సునీతమ్మ, కేశవయ్య, జైభారత్ సంఘము నేత కులాయప్ప పాల్గొన్నారు.



'అటల్ టింకరింగ్ ల్యాబ్'లో వేసవి శిక్షణ



శిక్షణా శిబిరంలో విద్యార్థిని సత్కరిస్తున్న డిఇఒ

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: తిరుపతి జిల్లా వరదయ్యపాళెంలోని అటల్ టింకరింగ్ ల్యాబ్ జడ్‌పిహెచ్‌ఎస్ స్కూల్లో నాలుగు రోజుల పాటు వేసవి శిక్షణ కార్యక్రమాన్ని అటల్ జిల్లా నోడల్ అధికారి మేఘనాథ్ పర్యవేక్షణలో మంగళవారం ప్రారంభించారు. నూతనంగా ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో వేసవి శిక్షణ కార్యక్రమం జరపడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏడు జిల్లాలలో, జిల్లాకు ఒక పాఠశాల చొప్పున ఎంపిక చేసింది. విజ్ఞాన్ ఆశ్రమం పూణే, యూనిసెఫ్, ఎస్ సి ఆర్ టి నీతి అయోగ్ సంస్థల సౌజన్యంతో విద్యార్థులకు అత్యాధునిక సాంకేతికతతో కూడిన ప్రాజెక్ట్ డాక్యుమెంటేషన్, 3డి ప్రింటింగ్, మెకానికల్ టూల్స్, బేసిక్ ఎలక్ట్రానిక్స్, అడ్వాన్స్ ఎలక్ట్రానిక్స్ పై శిక్షణ ఇస్తున్నారు. నాలుగు రోజులపాటు నేర్చుకున్న అంశాలపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి ధృవపత్రాలను అందజేస్తారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వి.శేఖర్ హాజరై విద్యార్థులు పొందుతున్న తర్ఫీదును ఆసక్తిగా పరిశీలించారు. పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చాటిన ఝాన్సీ, గ్రీష్మకుమారిలను డిఇఒ ఘనంగా సన్మానించి అభినందించారు. జిల్లా సైన్స్ అధికారి భాను ప్రసాద్, శిక్షకులు వెంకటేష్, పురుషోత్తం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్ బాబు పాల్గొన్నారు.

హెచ్‌సిఎల్ టెక్‌బి పథకంతో ఉపాధి



నిరుద్యోగ యువతకు ఉపాధిపై సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఇంటర్మీడియట్ తర్వాత విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు హెచ్‌సిఎల్‌టెక్‌బి పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ అన్నారు. మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో డిఆర్డిఏ, పరిశ్రమలు, స్కిల్ డెవలప్మెంట్, సంస్థల ప్రతినిధులతో రివ్యూ నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నైపుణ్యత కళాశాలల ద్వారా శిక్షణ పొందిన వారికి ప్రైవేట్ రంగాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అందుకు తగిన జాబ్‌క్యాలెండర్‌ను రూపొందించాలని పరిశ్రమల అధికారిని ఆదేశించారు. అదేవిధంగా హెచ్సీఎల్ టెక్‌బి పథకం ద్వారా తమ కెరీర్‌ను వినూత్నంగా మలుచుకునేందుకు తగిన అవకాశాలు కల్పించబడుతున్నాయని క్షేత్రస్థాయిలో ఈ పథకాన్ని ఉపయోగించుకునేందుకు తగిన అవగాహన కల్పించాలని కలెక్టర్ అన్నారు. దీనికి సంబంధించి విద్యార్థులకు స్టైఫండ్ కూడా ఇవ్వడం జరుగుతుందని అదేవిధంగా వారికి 1.7లక్షల నుంచి 2.2లక్షల వరకు సంవత్సర వేతనాలు ఉంటాయని అన్నారు. ఈపథకాలను రూపొందించేందుకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించాలని స్కిల్‌డెవలప్మెంట్, పరిశ్రమల శాఖ, డిఆర్‌డిఏ వారిని ఆదేశించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ కలెక్టర్ మేఘస్వరూప్, డిఆర్‌డిఎ పిడి తులసి, స్కిల్ డెవలప్మెంట్ అధికారి గుణశేఖర్‌రెడ్డి, పరిశ్రమలశాఖ జేడి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి గంగమ్మ జాతర మొదలయ్యిందోచ్..!

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: శ్రీ తాతయ్యగుంట గంగమ్మ దేవస్థానంలో మంగళవారం నిర్వహించిన చాటింపు ప్రక్రియతో జాతర మొదలయ్యింది. మంగళవారం ఉదయం 8 గంటలకు తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి , తిరుపతి కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష , డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ చేతుల మీదుగా చాటింపు సందర్భంగా కోడి స్తంభానికి అభిషేకం చేసి వడిబాల కట్టడంతో జాతర మొదలయ్యింది. ఉదయం 9.30 నిమిషాలకు శ్రీశ్రీశ్రీ దత్త పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామి వారు ఆలయానికి అమ్మవారి దర్శనానికి విచ్చేసినారు. అనంతరం ఉదయం 10.30 నిమిషాలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. మద్యాహ్నం 2.30 గంటలకు ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కట్టా గోపి యాదవ్, ఆలయ కార్యనిర్వహణాధికారి యం. ముని కష్ణయ్య పాల్గొన్నారు. గంగమ్మ సారె ఊరేగింపు మార్గాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని నగర పాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు.

'ఎక్సైజ్ శాఖ' అండతో..

ఆ బార్‌లో 'ఎనీ టైం మందు'

ప్రభుత్వ దుకాణాలు గంటముందే మూత

ప్రజాశక్తి - నాయుడుపేట

అధికార పార్టీ, అధికార యంత్రాంగం ఒక్కటైతే ఇంకా తిరుగేముంది.. వారి కనుసన్నల్లోనే ఏ పనైనా ఇట్టే అయిపోతుంది.. అదే జరిగింది నాయుడుపేటలోనూ... ఎక్సైజ్ శాఖ అండతో బార్‌లో 24 గంటలూ మందు సప్లై అవుతోంది.. అదీ ఎలాగంటే ప్రభుత్వ మద్యం దుకాణాన్ని గంటన్నర ముందే నిబంధనలకు విరుద్ధంగా మూయించేసి మరీ.. ప్రభుత్వ దుకాణం మూసివేసి, అధిక ధరలతో బార్‌లో మందు అమ్మడాన్ని మందుబాబులు మండిపడుతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ కూలీల డబ్బును కొల్లగొడుతున్నారు.

రాష్ట్ర మంతా మద్యం దుకాణాలు రాత్రి తొమ్మిది గంటలవరకు నిర్వహిస్తుంటే ఒక్క నాయుడుపేటలో మాత్రం అందుకు బిన్నంగా ఎనిమిది గంటల ముప్పై నిమిషాలకే మూసేస్తున్నారు. అంతేకాదు లక్షల్లో వ్యాపారం జరిగే షాపులను సైతం ఎటువంటి కారణాలూ లేకుండా అక్కడనుంచి తరలించేస్తున్నారు అదేమని ఎవరైనా అధికారులను వివరణ కోరితే చెప్పేందుకు నిరాకరిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన ఒక వ్యక్తి నిర్వహిస్తున్న బార్ కోసం అధికారులు ప్రభుత్వ ఖజానాకు సైతం గండి కొడుతున్నారు. నాయుడుపేటలో గత ఎనిమిదేళ్ల నుంచి బార్ నిర్వహిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చి ప్రభుత్వ మద్యం షాపులు తెచ్చాక కూడా ముందున్న బార్ నిర్వాహకులు వారి వ్యాపారాలు వారు చేసుకునే వాళ్ళే కానీ పక్క షాపుల బిజినెస్‌లో జోక్యం చేసుకునేది కాదు. అయితే అప్పట్లో ఇరవై లక్షలున్న బార్ లైసెన్సును వైసీపీ కి చెందిన వ్యక్తి ఇష్టానుసారంగా ఒక కోటి ముప్పై ఐదు లక్షలకు పెంచేశారు. అప్పటి నుంచి బార్ నిర్వహణ వారిష్టానుసారం నిర్వహిస్తున్నారు. ఆ బార్లో మద్యం విక్రయానికి సమయమంటూ లేదు. ఏ సమయంలోనైనా దొరుకుతుంది. వీరి వ్యాపారం కోసం ఈ బార్ కు దరిదాపుల్లోని ఏ ప్రభుత్వ మద్యం షాపును ఉండనివ్వటం లేదన్నది అక్షర సత్యం. అందుకు అధికారులు సైతం వంతపాడటం ఇక్కడ చెప్పుకోవలసిన విశేషం. నాయుడుపేటలోనే అత్యధిక వ్యాపారం జరుగుతూ లక్షల్లో ఆదాయం వస్తున్న రెండు షాపులను ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా అక్కడనుంచి తొలగించటమే ఇందుకు నిదర్శనం. సదరు బార్ నిర్వాహకుడైన అధికార పార్టీ వ్యక్తి జేబు నింపేందుకు అధికారులు సైతం విధి విధానాలను తుంగలో తొక్కి ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతుండడం శోచనీయం. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి రాష్ట్రమంతా అమలులో ఉన్న సమయాన్ని కుదించి నాయుడుపేటలోని ప్రభుత్వ మద్యం దుకాణాలను ప్రభుత్వం నిర్ణయించిన సమయానికి అరగంట ముందే మూసేస్తున్నారు. ఈ విషయమై ఎక్సైజ్ ఎస్సై, సీఐలను వివరణ కోరేందుకు ప్రయ్నతించినా వారు స్పందించకపోవడం గమనార్హం. ఎక్సయిజ్ సీఐ కిషోర్ 'ఔనా ముందుగానే మూసేస్తున్నారా.. నేను విచారిస్తాను' అని నమ్మశక్యం కాని వివరణ ఇవ్వడం ఆ శాఖ ఎంతగా ఆ బార్‌కు 'సపోర్టు'గా ఉందో ఇట్టే అర్థమవుతోంది.



పేదల అభివృద్ధికి సీఎం జగన్ చేయూత

డిప్యూటీ సీఎం నారాయణస్వామి



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: బడుగు వర్గాల అభివద్ధికి వివిధ పథకాలతో సీఎం జగన్ మోహన్ రెడ్డి చేయూత అందించారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. మంగళ వారం మండల పరిధిలోని నెల్లేపల్లి పంచాయ తీలో రెండో రోజు గడపగడపకు మన ప్రభు త్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక సర్పంచ్ రవీంద్రారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని కొనసా గించారు. ఈ సందర్భంగా చిన్నమెట్టపల్లి, పెద్దమిట్టపల్లి, నెల్లేపల్లి దళితవాడ, నెల్లేపల్లి, బొబ్బిగానిపల్లె తదితర గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల అభిప్రాయాన్ని సేకరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రభుత్వం ఇన్ని సంక్షేమ కార్యక్రమాలను చేపట్టలేదని, ప్రస్తుత ప్రభుత్వం మాత్రమే ప్రతి లబ్ధిదారుడి బ్యాంక్ ఖాతాలో నిధులు జమ చేస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిత, ఎంపీడీఓ శ్రీదేవి, తహాశీల్దార్ ఇన్నూనాధన్, సీడీపీఓ వినతి శ్రీ, మండల వైసీపీ కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, పలువురు అధికారులు, నేతలు పాల్గొన్నారు.

ఆంగ్లభాషపై పట్టు ఉండాలి



ప్రజాశక్తి-కార్వేటినగరం: విద్యార్థులకు ఆంగ్లభాషపై పట్టు ఉండాలని బాలికల ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయురాలు రెడ్డెమ్మ అన్నారు. గ్రంథాలయ వేసవి శిక్షణా కార్యక్రమంలో భాగంగా మంగళ వారం విద్యార్థులకు ఆంగ్ల భాషపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు రెడ్డెమ్మ మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశానికి వెళ్లి రాణించాలన్నా ఆంగ్లభాషపై పట్టు తప్పనిసరని అన్నారు. ఆంగ్ల భాష సులభంగా అర్థం అవ్వాలన్నా, ఆంగ్లంలో క్షుణ్ణంగా మాట్లాడాలన్నా గ్రామర్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. అనంతరం గ్రంథాలయ అధికారి శంకర్ బాబు మాట్లాడుతూ ఆంగ్లభాషపై నైపుణ్యత కలిగిన వారు అందించే ప్రతి విషయాన్ని విద్యార్థులు తప్పక గుర్తించుకోవాలని, గ్రంథాలయంలో జరిగే వేసవి శిక్షణా తరగతులు విద్యార్థులకు ఓ వరం లాంటిందని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి విద్యార్థి రాణించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకటేష్ శిరీషా, రాఘవేంద్రరాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలను సత్వరం పరిష్కరించాలి



ప్రజాశక్తి-సోమల: రెవెన్యూ పరంగా వచ్చే స్పందన అర్జీలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేసి సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చూడాలని తహాశీల్దార్ శ్యాం ప్రసాద్ రెడ్డి కోరారు. మంగళవారం స్థానిక తహాశీల్దార్ కార్యాలయంలో వీఆర్ఓలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తహాశీల్దార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కాలనీలలో శ్మశాన వాటికలకు భూమిని పరిశీలించి వారికి శ్మశాన వాటిక ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని, చౌక దుకాణాల నిత్యావసర సరుకులను ప్రత్యేక వాహనాల ద్వారా ప్రజలకు సకాలంలో సమస్య లేకుండా అందరికీ అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహాశీల్దార్ కార్యాలయ సిబ్బంది, వీఆర్ఓలు పాల్గొన్నారు.

అక్రమ తాగునీటి కొళాయిల తొలగింపు



ప్రజాశక్తి-సోమల: మండలంలోని అన్నెమ్మ గారి పల్లి పంచాయతీలోని పలు గ్రామాలలో అనధికార, అక్రమ తాగునీటి కొళాయిలను సర్పంచ్, పంచాయతీ సిబ్బంది మంగళవారం తొలగించి సక్రమమైన తాగునీటి కొళాయిలు కలిగిన వారికి మంచి నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఇటీవల కాలంలో గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తడంతో సమస్య గుర్తించి అక్రమ కొళాయిల కారణంగా మిగిలిన అందరికీ తాగునీరు సరఫరా కావడం లేదని, దీంతో తాగునీటి అక్రమ కనెక్షన్లను తొలగించడంతో మిగిలిన అందరికీ త్రాగునీరు అందే అవకాశం ఉందని గుర్తించి వాటిని తొలగించారు. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమైందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో వైసీపీ నేత రమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి లలిత కుమారి, సచివాలయ సిబ్బంది, వైస్ సర్పంచి పాల్గొన్నారు.

గొర్రెల దొడ్డిలో కొండచిలువ



ప్రజాశక్తి-సోమల: గొర్రెల దొడ్డిలో కొండచిలువ పామును చూసిన గ్రామస్తులు భయభ్రాంతులకు గురై, దానిని కొట్టి చంపిన సంఘటన మంగళవారం ఇరికిపెంట పంచాయతీలో చోటుచేసుకుంది. వివరాలు.. ఇరికిపెంట పంచాయతీ పార్వతి నగర్ గ్రామంలోని వెంకటరామయ్య గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగించేవాడు. రోజులాగే మంగళవారం గొర్రెలను మేతకు తోలుదామని గొర్రెల దొడ్డిలోకి వెళ్లి చూడగా కొండచిలువ కనిపించడంతో భయంతో పరుగులు తీశాడు. ఈ విషయం గ్రామంలో తెలియడంతో గ్రామస్తులు కొండచిలువను కర్రలతో కొట్టి చంపారు. కొండచిలువ 10 అడుగులకు పైగా ఉందని, ఎలా, ఎప్పుడు వచ్చిందో అని గ్రామస్తులు మాట్లాడుకోవడం కనిపించింది. అనంతరం చనిపోయిన కొండచిలువతో స్థానిక ప్రజలు సెల్ఫీలు దిగడం కొస మెరుపు.

ఆర్వో ప్లాంట్ పనుల పరిశీలన



ప్రజాశక్తి-రొంపిచెర్ల: స్థానిక సచివాలయం-1 వద్ద గ్రామ మంత్రి పెద్దిరెడ్డి మంజూరు చేసిన 4000 లీటర్ల ఆర్వో ప్లాంట్ పనులను సర్పంచ్ ఇబ్రహీంఖాన్ ఆధ్వర్యంలో మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ త్వరలో మంత్రిచే ప్రారంభించడానికి సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు. వైసీపీ నాయకులు చిన్న నాగరాజ, శ్రీపతి, కరీముల్లా పాల్గొన్నారు.

నేడు ఆధార్ నమోదు క్యాంపు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీ వినాయకపురం ఎస్టీ కాలనీలో బుధవారం ఆధార్ నమోదు క్యాంపు, వైద్య శిబిరం, పశువైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నాగరాజు మంగళవారం తెలిపారు. ఎస్టీ కాలనీలో 27 కుటుంబాలు నివశిస్తుండగా పలువురు ఆధార్ కార్డు తీసుకోకపోవడంతో సంక్షేమ పథకాలను అందుకోలేకపోతున్నారని ఇందుకోసం ప్రత్యేక ఆధార్ క్యాంపు నిర్వహించి గ్రామంలోని పిల్లలు, పెద్దలకు ఆధార్ కార్డులను అందజేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు పంచాయతీ కార్యదర్శి జయశంకర్ తెలిపారు. వినాయకపురం ఎస్టీ కాలనీ మండల కేంద్రమైన ఐరాల సమీపంలో ఉండడం గమనార్హం.

రాయితీతో జనుము, జీలుగ విత్తనాల పంపిణీ



ప్రజాశక్తి-గుడిపల్లి: రాయితీతో జనుము, జీలుగ విత్తనాలను 50 శాతం రాయితీతో పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి నాగరాజు మంగళవారం తెలిపారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ జీలుగ విత్తనాలు 10 కేజీల బ్యాగు 50 శాతం రాయితీ పోను రూ.395 లకు, జనుము 10 కేజీల బ్యాగు 50 శాతం రాయితీ పోను రూ.420 లకు రైతులకు అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ పచ్చ రొట్టె ఎరువులను వర్షాలు పడిన వెంటనే నేలలో తగినంత తేమ ఉన్నప్పుడు ఎకరాకు 10 నుంచి 12 కేజీలు చొప్పున విత్తుకొని 45 రోజుల తర్వాత పంట బాగా పెరిగి నాలుగు నుంచి ఐదు టన్నుల పచ్చి రొట్టె ఎరువుగా మారుతుందన్నారు. వీటిని పూత దశలో ఉన్నప్పుడు రోటవేటర్ సహాయంతో పొలంలోకి కలియ దున్నడంతో ఈ పచ్చ రొట్టె ఎరువులు భూమిలో బాగా కలిసిపోయి రాబోయే పంటలకు నేలను బాగా సారవంతం చేసి, నత్రజని భాస్వరం ఎరువులను, జింక్, కాల్షియం ఇనుము వంటి సూక్ష్మ పోషకాలను కూడా నేలకు అందజేస్తాయన్నారు. అదేవిధంగా నేల సహజ మిత్రులైన వానపాములను పెంచి, నేల నీటిని పట్టుకునే సామర్థ్యాన్ని కూడా పెంచుతాయని తెలిపారు. ఇవి లెగ్యూమ్ జాతికి చెందినవి కాబట్టి నత్రజని స్థిరీకరణ కూడా చేస్తాయని చెప్పారు. కావున రైతులందరూ ఈ జనుము, జీలుగలు పెంచి నేల సారమును పెంచుకొని తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడులు పొందాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్, ప్రజా ప్రతినిధులు, రైతులు, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.


కరెంటు ఛార్జీలను తగ్గించాలి



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ట్రూ ఆఫ్ చార్జీలను రద్దు చేయాలని, కరెంట్ ఛార్జీలు తగ్గించాలని, ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న 200 యూనిట్లను కొనసాగించాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో గాంధీ రోడ్డులోని ఏపీఎస్ పీడీసీఎల్ డివిజనల్ ఇంజనీర్ ఆపరేషన్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈకార్యక్రమానికి వీసీ.గోపీనాథ్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 4 సంవత్సరాల కాలంలో ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో 7 సార్లు విద్యుత్ చార్జీలను పెంచిన ఘనత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి దక్కిందన్నారు. ట్రూఆఫ్ చార్జీల పేరుతో కొత్త పేర్లు పెట్టి కరెంట్ ఛార్జీలను పెంచి సామాన్య, మధ్యతరగతి ప్రజల పైన అధిక భారాన్ని మోపడం చాలా దారుణమన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వానికి తలవగి ట్రూఆఫ్ చార్జీల పేరుతో కరెంట్ చార్జీలను పెంచి రాష్ట్రంలోని వినియోగదారులను (ప్రజలను) మోసం దగా చేస్తున్నదని మండిపడ్డారు. కరెంట్‌ఛార్జీలు కట్టలేని పరిస్థితుల్లో సామాన్యులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.


వైద్యుల సూచనలతో పరీక్షలు చేయించుకోవాలి

ప్రజాశక్తి-సోమల: గర్భిణులు వైద్యుల సలహాలు, సూచనలతో ప్రసవంలోపు నాలుగుసార్లు వైద్య పరీక్షలు చేయించుకుని, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకొని సుఖ ప్రసవం అయ్యేలా చూసుకోవాలని సోమల ప్రభుత్వ వైద్యాధికారి జయసింహ అన్నారు. మంగళవారం స్థానిక వైద్యశాలలో ప్రధాన మంత్రి మాతత్వ వందన యోజన కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు బిపి, షుగర్, రక్తహీనత తదితర వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గర్భిణులు అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న అదనపు పోషక ఆహారాన్ని తప్పక తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి 51 మంది గర్భిణులు హాజరు కాగా వారిలో రిస్క్ గుర్తించిన 15 మందిని తిరుపతి మెటర్నిటీ హాస్పిటల్, రుయా హాస్పిటల్‌కు రెఫర్ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది చిన్నప్ప, గీత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



బైరెడ్డిపల్లి: మండల పరిధిలోని తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి అరుణ్ కుమార్ అధ్యక్షతన ప్రధానమంత్రి సురక్ష మాతత్వ అభియాన్ కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న పి శ్రీదేవి, హెల్త్ సూపర్‌వైజర్, పి హెచ్‌సి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి పుష్పపల్లకి వేడుకలు



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని బేలుపల్లి పంచాయతీ పట్నపల్లిలో నెలకొనివున్న శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామి పుష్పపల్లకి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామికి ప్రత్యేకంగా అర్చకులు మురళి కష్ణమాచార్యులు, శ్రీనివాసచార్యులతో కల్యాణ ఉత్సవం చేపట్టి అనంతరం స్వామి, ఉభయదేవేర్ల ఉత్సవమూర్తులను శాస్త్రోక్తంగా బేలుపల్లి శ్రీ కోదండరామస్వామి ఆలయం వద్దకుతీసుకెళ్లి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పుష్పపల్లకిలో ఆశీనులు చేసి అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పల్లకి రంగురంగుల విద్యుత్ దీపాలు, వివిధ పూలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఈ పుష్పపల్లకి వేడుకలు రాత్రి 2 గంటలకు గ్రామ వీధుల్లో ఊరేగించి మంగళవారం ఉదయం పట్నపల్లిలోని ఆలయానికి చేరుకొంది. ఈ సందర్భంగా తమిళనాడు రాష్ట్రం వేలూరు పట్టణం నుంచి విచ్చేసిన నాదశ్వర విద్వాంసులు చేపట్టిన వాయిద్యం ప్రత్యేకత సంతరించుకుంది. 3 రాష్ట్రాల భక్తులు పోటెత్తారు. పలమనేరు డిఎస్‌పి, సి.ఐ, బైరెడ్డిపల్లి ఎస్ఐ, పోలీసు సిబ్బంది గట్టి భద్రత ఏర్పాట్లు చేశారు. ఆలయ నిర్వాహకులు, దాతలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

క్రికెట్ పోటీలలో గెలుపొందిన బాయ్స్ అండ్ బాలు టీం



ప్రజాశక్తి-గంగవరం: మదర్ థెరిసా విద్యా సంస్థలు ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో గత 3 రోజులుగా జరిగిన క్రికెట్ పోటీలలో బాయ్స్ అండ్ బాలు టీం తో కలిసి ఆడిన మొదటి కళాశాల విద్యార్థులు మొదటి బహుమతి సాధించినట్లు ఛైర్మన్ సునీల్ కుమార్ తెలియజేశారు. అనంతరం ఛైర్మన్ మాట్లాడుతూ మదనపల్లి చైతన్య కళాశాల విద్యార్థులు రెండో బహుమతి తీసుకున్నారన్నారు. మొదటి బహుమతి రూ.25 వేలు, రెండవ బహుమతి రూ.15 వేలు ప్రధానం చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ముఖ్యమని, అందుకే తమ కళాశాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపటామన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రవీంద్రబాబు, అకాడమీ అధికారి రాజేందర్ రెడ్డి, కళాశాల సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు నియామక పత్రాల పంపిణీ

ప్రజాశక్తి-గంగవరం: మండలంలో ఖాళీగా ఉన్న ఆరు వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించి ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేసిన అభ్యర్థులకు మంగళవారం నియామక పత్రాలను స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వెంకటరమణ, జడ్పిటిసి సభ్యులు పార్వతి చంద్ర చేతుల మీదుగా అందజేశారు. ఇందులో కీళ్లపట్ల 2, మా మడుగు, మేలు మాయ, జీడిమాకులపల్లి, తాళ్లపల్లి 1 చొప్పున భర్తీ చేసి వారికి నియమాపక పత్రాలు అందజేసినట్లు ఎంపీడీవో శివప్రసాద్ తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ ఎస్ఆర్ లేఖ్య, సర్పంచుల అధ్యక్షుడు గిరి రాజారెడ్డి, కన్వీనర్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్‌గా సురేంద్రరెడ్డి



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ ప్రజాశక్తి ఫోటోగ్రాఫర్ సురేంద్రరెడ్డి నియమితులయ్యారు. చిత్తూరు జిల్లాలో ప్రజాశక్తి దినపత్రికలో సీనియర్ ఫోటోగ్రాఫర్‌గా సుదీర్ఘకాలం పనిచేశారు. కురుక్షేత్రం స్టాఫర్ వెంకటరత్నం, టి.శివప్రసాద్ సీనియర్ రిపోర్టర్ సాక్షి, కె. ఉమాశంకర్ హిందూ, కె.జయరాజ్ టీవీ9, సురేంద్రరెడ్డి ప్రజాశక్తి, కె.శ్రీకాంత్ సాక్షి టీవీ జిల్లాకు అక్రిడేషన్ కమిటీ మెంబర్‌గా నియమితులయ్యారు.

గంగమ్మకు అభిషేకం



ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరులో జరుగుతున్న గంగమ్మ జాతరలో భాగంగా 9వ రోజైన మంగళవారం గాండ్ల కులస్థుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకపూజలు, భక్తులకు అన్నదానం చేశారు. స్థానిక పాతపేట వేణుగోపాలస్వామి ఆలయం నుంచి పసుపు నీళ్ల కలిశాలకు పూజలు నిర్వహించి, మహిళలు పురవీధుల గుండా అలరించే విధంగా కోలాటాలు, పంబ వాయిద్యాలు, చక్కభజనలు, దేవతా మూర్తుల చిత్ర పటాల ప్రదర్శనల నడుమ భక్తి శ్రద్ధలతో కొత్తపేటలో వెలిసిన తిరుపతి గంగమ్మ ఆలయం చేరుకొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిత్తూరు జిల్లా అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు భూపేష్ గోపినాథ్ పాల్గొన్నారు. అనంతరం గాండ్ల సంఘం ప్రతినిధులు ఆకుల కష్ణమూర్తి, ఏఆర్ కుమార్, కేశవులు, కుమారగురు, ఆర్‌బిసి మురళి, డాక్టర్ అంజిబాబు, శ్రీనివాసులు, మూర్తి, కేశవులు తదితరులు అతిథిగా విచ్చేసిన భూపేష్ గోపినాథ్‌ను సత్కరించి సన్మానించారు. స్థానిక అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు అశోక్ పాల్గొన్నారు.

'అభివృద్ధి అంటే చంద్రబాబు'



ప్రజాశక్తి-గుడిపల్లి: అభివృద్ధి అంటే మాజీ సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని క్లస్టర్ ఇన్‌ఛార్జ్ హేమాంబ గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని అగరం గ్రామ పంచాయతీలో తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ రచ్చబండ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పంచాయతీలోని అన్ని గ్రామాల తెలుగుదేశం పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హేమాంబ గౌడ్ మాట్లాడుతూ అగరం గ్రామపంచాయతీకి తెలుగుదేశం ప్రభుత్వంలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించిన ఘనత ఒక తెలుగుదేశం పార్టీకి దక్కుతుందన్నారు. అలాంటి ప్రభుత్వాన్ని మనం 2024లో అధికారంలో తీసుకొని వచ్చే విధంగా మన గ్రామ పంచాయతీలో పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బాబు నాయుడు, మాజీ ఎంపీపీ రాజు, మాజీ జడ్పిటిసి బెటప్ప నాయుడు, సర్పంచ్ గోపాల్, మాజీ యువత అధ్యక్షులు సుబ్రమణి, బిసి సెల్ అధ్యక్షుడు ఉదయ్ కుమార్, నియోజకవర్గ యువత అధ్యక్షులు వెంకటేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు సోమలలో ముఖాముఖి

ప్రజాశక్తి-సోమల: మండలంలోని గృహసారథులు, వాలంటీర్లు, సంఘమిత్రలు, ఫీల్డ్ అసిస్టెంట్లతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం ఉదయం 9 గంటలకు స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వైసీపీ అధ్యక్షులు గంగాధర రాయల్ మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

ఉపాధిలో ప్రతికూలీకి పని కల్పించాలి



ప్రజాశక్తి-పులిచెర్ల: ఉపాధి పథకంలో ప్రతి కూలీకి పని కల్పించాలని ఎంపీడీవో సుగుణమ్మ తెలిపారు. మంగళవారం పులిచెర్ల మండలం వెంకటదాసరపల్లి పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను మంగళవారం ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలన్నారు. పనుల్లో నాణ్యత లోపించకుండా ఫీల్డ్ అసిస్టెంట్ల పర్యవేక్షణ ఉండాలన్నారు. పనుల వద్ద తాగునీరు తదితర సౌకర్యాలు కూలీలకు కనిపించాలన్నారు. రైతులకు, కూలీలకు ఉపయోగపడే పనులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో జేఈ కష్ణయ్య, ఎఫ్ఏ దామోదర్ రెడ్డి, కూలీలు పాల్గొన్నారు.

పోలీసులతో నాకాబందీ



ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమల పోలీసు సిబ్బంది మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వాహనాల తనిఖీ చేపట్టామని, ద్విచక్ర, కారు, లారీ, టెంపో ఇతర వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి రికార్డులను తనిఖీ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నియామక పత్రం అందజేత



ప్రజాశక్తి-రొంపిచెర్ల: ఆర్‌టిఐఎ ఫౌండర్ ముత్తు సూచనల మేరకు చిత్తూరు జిల్లా కన్వీనర్‌గా డాక్టర్ రఘునాథ్, చిత్తూరు జిల్లా కార్యవర్గ సభ్యులకి నియామక పత్రం గుర్తింపు కార్డులు, సమాచార హక్కు చట్టం కార్యకర్తల సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ జివిఎస్ బాబు మంగళవారం అందజేశారు. రొంపిచెర్ల మండలం కోఆర్డినేటర్ మల్లేపల్లి వెంకటేష్, పుంగనూరు నియోజకవర్గ కార్యదర్శి ధనంజయ్, నూతన కార్యవర్గ సభ్యులు ఓబులేష్ పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టిక ఆహారం పంపిణీ



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్ష మాతత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహతి ఫౌండేషన్ ఛైర్మన్ నాగరాజు సహకారంతో గర్భిణులకు ఉచితంగా పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఇందులో భాగంగా డాక్టర్ విజయ్ చంద్ర మాట్లాడుతూ అమ్మాయిలకు చిన్న వయసులో పెళ్లిళ్లు చేయడంతో శారీరక, మానసిక ఎదుగుదల ఉండదన్నారు. దీంతో మాతా శిశుమరణం సంభవించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు శాలిని, విజయచంద్ర, వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడి మృతి



ప్రజాశక్తి-గంగవరం: గంగవరం పంచాయతీ సర్పంచ్ చంద్రమ్మ భర్త, వైసీపీ సీనియర్ నాయకులు మొగిలప్ప ఆకస్మికంగా మంగళవారం మృతి చెందారు. దీంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న శాసన సభ్యులు వెంకటే గౌడ, జడ్పిటిసి చంద్రప్ప, ఎంపీపీ వెంకటరమణ, వైసీపీ కార్యకర్తలు మృతదేహానికి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మండల వైసీపీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని ఆయనకు నివాళులర్పించారు.

ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తి...



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఆత్మహత్యకు ప్రయత్నించి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందినట్లు ఏఎస్ఐ మల్లప్ప తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు... మండలంలోని బంగారుపాళ్యం దళితవాడలో నివశిస్తున్న రత్నం కుమారుడు ఉదయ్ కుమార్ (57) గత రెండు సంవత్సరాలుగా అనారోగ్యానికి గురై పలు చికిత్సలు చేసుకున్నాడు. దీంతో విరక్తి చెంది సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా స్థానికులు గమనించి బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స చేసి, మెరుగైన చికిత్సకు చిత్తూరుకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్టు పోలీసులు తెలిపారు.

కాలి బూడిదైన శవం

దర్యాప్తు చేస్తున్న టూటౌన్ పోలీసులు



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో గురువారం షాదిక్ ఫర్నిచర్ గోడౌన్ అగ్నికి ఆహుతైన విషయం విధితమే. నాలుగు రోజులు తరువాత సోమవారం రాత్రి అగ్నికి ఆహుతైన ఫర్నిచర్ గోడౌన్ శిథిలాల్లో కాలిబూడిదైన శవం బయటపడింది. ఫర్నిచర్ గోడౌన్‌లోని పక్కా భవనంలో ఓ మూలకాలిన శవాన్ని గుర్తించారు. శిథిలాలను తొలగిస్తున్న సమయంలో కాలిన శవాన్ని గుర్తించిన్నట్లు టూటౌన్ సిఐ మద్దాచ్చారి తెలిపారు. యువకుడు కాలి బూడిదైన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఫర్నిచర్ గోడౌన్ యజమానికి పోలీసులు ప్రశ్నించినా తమ గోడౌన్‌లో మరణించిన వ్యక్తి సమాచారం తమకు తెలియదని పోలీసులకు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసిన టూ టౌన్ పోలీసులు అగ్నికి ఆహుతైన యువకుడు ఎవ్వరు... ఫర్నిచర్ గోడౌన్‌లో పనిచేసే వ్యక్తా లేదా బయటి వ్యక్తా.. అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

ఎం.వడ్డిపల్లెలో కారు చోరీ

ప్రజాశక్తి-సోమల: మండలంలోని పొదలకుంటపల్లి పంచాయతీ ఎం వడ్డిపల్లి గ్రామానికి చెందిన రవీంద్ర బాబు కోలార్‌లో ప్రైవేటు జాబ్ చేసుకుంటూ ఉండేవాడు. సొంత పనిమీద ఈనెల 7వ తేదీ తన కారును తీసుకొని సొంత గ్రామానికి వచ్చాడు. రాత్రి ఇంటి వద్ద పార్కు చేసి ఇంటిలో నిద్రపోయాడు. ఉదయం చూడగానే కారు కనిపించకపోవడంతో చోరీకి గురైందని గుర్తించి మంగళవారం సోమల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత



ప్రజాశక్తి-గుడిపల్లి: మండలానికి చెందిన తిమ్మాజి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మండల సర్పంచ్ చంద్రయన్ సీఎం రిలీఫ్ ఫండ్ కింద అత్యవసరంగా రూ.10 వేల నగదు మృతుని కుటుంబానికి అందజేశారు. అలాగే త్వరలో మృతుని కుటుంబానికి రూ.లక్ష మంజూరు అవుతుందని సర్పంచ్ హామీ ఇచ్చారు.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

ప్రజాశక్తి-కార్వేటినగరం: టీటీడీకి అనుసంధానంగా ఉంటున్న రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో జరగబోయే వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళ వారం ఆలయంలో వేదపండితులు కోయిల్ ఆళ్వార్ కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అర్చకులు గడ్డకర్పూరం, కిచ్చిలి ఆకు, చందనం, పసుపు వంటి సుగంధ ద్రవ్యాలను కలిపి వేద పండుతులు వేద మంత్రాల నడుమ మాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు సురేష్ బాబు, నాగరాజు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

12వ రోజుకు చేరిన

తాత్కాలిక ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి-గుడిపల్లి: ద్రావిడ వర్సిటీ తాత్కాలిక ఉద్యోగుల సమ్మె మంగళవారం 12వ రోజుకు చేరుకుంది. తాత్కాలిక ఉద్యోగులందరూ తమ న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం, ఉన్నత విద్యాలయ అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని కోరుతూ వర్సిటీ ప్రధాన ద్వారం ఎదుట సమ్మెను కొనసాగించారు. కానీ విశ్వవిద్యాలయ పక్షాన అధికారుల నుండి తాత్కాలిక ఉద్యోగులకు ఎటువంటి హామీ గాని, సమ్మెను విరమింప చేయడానికి ఏ ఒక్క అధికారీ ప్రయత్నించకపోవడం ఎంతో శోకించదగిన విషయమని తాత్కాలిక ఉద్యోగులు వాపోయారు.